


# కథ

## గంటి భానుమతి

# ప్రియమైన దోపిడి

తలుపుతోసుకుని వచ్చిన సుమిత్రని చూడగానే చిర్రెత్తుకొచ్చింది సీతకి.

"ఏం సుమిత్రా! ఇప్పుడా రావడం? ఓసారి టైం చూడు ఎంతయిందో! పండగలొస్తున్నాయి. నేను బజారెళ్ళాలి, పెందరాళే రమ్మనమని నీకు నిన్ననే చెప్పాను. అయినా పొద్దుపోయి వచ్చావు. నువ్విప్పుడొస్తే నీ పనెప్పుడవుతుంది. నేనెప్పుడు బజారెళ్ళాలి. ఎన్నిసార్లు చెప్పినా నీ ధోరణి నీది. మాట్లాడవు"

సుమిత్ర సంతోషం నిండిన మొహంతో నవ్వింది.

"నా బిడ్డ ఫోన్ చేసిందమ్మా. ఇంగ ఊకే ఒకటే ముచ్చట్లు. టైం తెల్వలే. బతకమ్మ పండగకి వొస్తా నంది"

"అయితే కూతురొస్తోందన్నమాట. బావుంది. మరి మొదటి పండగకదా. ఏవయినా బట్టలూ అదీ పెట్టాలా..మీలో ఉందా పండగకి బట్టలు పెట్టడం అదీనూ.." ప్రసన్నంగా అడిగింది సీత.

"మొదటి పండగకయితే ఎట్లయిన పెట్టాల..ఎంత లేకున్నా కూడా పెట్టాలి. ఇగ అల్లున్కి పెట్టకున్న పర్వాలే. కానీ బిడ్డకయితే పెట్టాల. పలారాలు యియ్యాల...పొయ్యేటప్పుడు పైసలియ్యమ్మా"

"పైసలా! పైసలేవిటే? నీ జీతం కాస్తా ముందే తీసుకున్నావు. ఇంకా ఆరొందలు బాకీ ఉన్నావు. మళ్ళా అడ్వాన్స్! నా దగ్గర్లేదు. వేరే యిళ్ళల్లో అడుగు"

సీత మాటలు పూర్తిగా వినకుండానే, సుమిత్ర పనిచేసుకోవడానికి లోపలికెళ్ళిపోయింది.

వెళ్ళిపోయిన సుమిత్ర వైపు చూసి, చిన్నగా నిట్టూర్చింది. ఏమిటో పండగలన్నీ డబ్బుతో ముడిపడి వున్నాయి. పండగ ఆనందం కావాలంటే డబ్బు కావాలి. అందుకోసమే సుమిత్ర అడిగింది. సీతకి సుమిత్రకి యివ్వాలని ఉన్నా డబ్బెక్కడుంది?

లేదన్నా సుమిత్ర నమ్మదు.

ఒకప్పుడు సీత చేతి నిండా డబ్బుండేది. అప్పుడు ఆమెకు ఉద్యోగం ఉండేది. ఆ సంగతి సుమిత్రకి తెలుసు. ఇప్పుడుద్యోగం లేదన్న సంగతి కూడా తెలుసు. కానీ ఆమె దగ్గర డబ్బుందో లేదో ఆమెకక్కర్లేదు.

మూడేళ్ళ క్రితం సీత ఉద్యోగం పోయింది. పురిటి కోసం తీసుకున్న సెలవని అలాగే పొడిగించేసారు ఆఫీసువాళ్ళు. కారణం ఆర్థిక మాంద్యం అన్నారు. ప్రస్తుతం పైన పటారం లోన లొటారంలా ఉంది.సీత జీవితం. భర్త జీతంలో సగం అప్పులకే పోతుంది. మిగిలిన దానితో సమర్థించలేక అవస్థపడుతోంది.

అయినా ఈ సుమిత్ర యిలా అప్పుచేసి ఆ కూతురికి చీరలు సారెలు పెట్టకపోతేనేం! డబ్బు లేకపోతే ఊరుకోవాలి. అంతేకానీ యిలా గొప్పలు పోవడం ఎందుకు?

అయితే ఆ గొప్పల వెనక, అప్పుల వెనకాల తల్లి మమత ఉంది అన్న సంగతి తెలుసు సీతకి.

ఇప్పుడు సుమిత్రలాంటి పరిస్థితి సీత చిన్నప్పుడు ఆమె తల్లి కామాక్షి ఎదుర్కొంది. అప్పు చేసింది.

పెళ్ళయిన ఏడునెలలకి సీత అక్క బాల మొదటి సారిగా దసరా పండగలకొస్తోంది. సీతకి, బాలకి మధ్య పదేళ్ళ తేడా. వాళ్ళిద్దరి మధ్య ఇద్దరు మగపిల్లలు.

"అంతమందికీ ఉత్తరాలు రాసాం, ఫోన్లు చేసాం కాబట్టి బాలని, అల్లుణ్ణి పంపుతున్నారుట. లేకపోతే పంపేవారు కాదుట..." అంది కామాక్షి.

"ఒకే యింట్లో ఉండేవాళ్ళకి విడివిడిగా ఉత్తరాలు రాయడం, ఫోన్లో మాట్లాడ్డం, ఎక్కడా విన్లేదు కన్లేదు. ఓ ఉత్తరం రాస్తే సరిపోదా! మర్యాద చాలదా! అంతస్తూ, హోదా తగ్గిపోతుందా! అయినా ఈ కాలంలో ఈ ప్రోటోకాల్, ఈ హైరార్కీ...నీ మాట తీసెయ్యలేక అందరికీ ఉత్తరాలు రాసాను" అన్నాడు శేషాద్రి.

నవ్వింది కామాక్షి.

"పిల్లనిచ్చుకున్నాక యివన్నీ తప్పదు. కూతురికి అల్లుడికి బట్టలు కొనాలి. ఓ గ్రాము బంగారం అయినా పెట్టకపోతే బావుండదు. రేపు ఆఫీసుకెళ్ళాక అడ్వాన్స్‌కి దరఖాస్తు పెట్టుకోండి"

"ఇప్పుడప్పుచేసి, యివన్నీ చెయ్యకపోతేనేం! ఛాదస్తం కాకపోతే.."

తల అడ్డంగా ఊపింది కామాక్షి.

"ఇది చాదస్తం కాదు. ముచ్చట. డబ్బున్నా లేకపోయినా ఆ ముచ్చట తీరాల్సిందే. అయినా మీకు తెలీదు కానీ, అత్తింట్లో ఉన్న ఆడపిల్లకి పుట్టింటి ఆసరా, అండదండలూ ఉంటేనే గౌరవం. పెద్దరికం నిలబెట్టుకోవాలంటే పద్ధతి ప్రకారంగా నడచుకోవాలి. సాంప్రదాయ ప్రకారంగా చేయాలి"


"సాంప్రదాయమా! ఇవన్నీ మన పూర్వీకులు తీరిగ్గా కూచుని పెట్టినవే. నన్నడిగితే ఇదో రకం దోపిడి అంటాను"

కామాక్షి వింతగా శేషాద్రి వైపు చూసింది.

"దోపిడియా! ఇందులో దోపిడీ ఏవుంది? అసలు మీకు దోపిడీకి అర్థం తెలుసా! ఇంకోళ్ళ శ్రమమీద బతకడం అన్నది నాకు తెలిసిన అర్థం. ఇదే మీ అర్థం అయితే ఆ అర్థాన్ని యిక్కడ అన్వయించకండి" తీవ్రంగా అంది కామాక్షి.

"అంత కోపం దేనికి? ఏదో అన్నాను.." అంటూ నవ్వబోయాడు.

"ఏదో కాదు. మీకిలాంటి భాష వాడడం అలవాటు. అలవాటుగా అనేసారు. మీ ఈ భాషని మీ ఆఫీసులో, బయట స్నేహితుల దగ్గర వాడండి. ఇంట్లో కాదు. మీరన్నట్లుగా ఇది దోపిడి అయితే, సమాజంలో గాలి వీచినంత సహజంగా జరిగిపోయే దోపిడి. దోచేవారికి సంతోషం, దోచుకోబడ్డవారికి తృప్తి, ఆనందం ఇచ్చే దోపిడి. అందరికీ ఆమోదం అయిన ప్రియమైన దోపిడి. ఏదో మన తాహతుకి తగ్గది కొందాం. ఇది గొప్పకోసం చేస్తున్నది కాదు. ఆదర్శం కోసం చేస్తున్నది కాదు. మనస్ఫూర్తిగా చేస్తున్నది. ఇందులో బాధ కాదు, తృప్తి ఉంటుంది.." అన్న కామాక్షి మాటలకి ఎదురు చెప్పలేదు శేషాద్రి.





"సీతా అలమరాలో ఓ అర ఖాళీ చెయ్యి. అక్క బట్టలు పెట్టుకుంటుంది. పుస్తకాల అరల్లో పైది ఖాళీ చేస్తే దాని టాయిలెట్ సామానుంచుకుంటుంది.."

ఆ తర్వాత బూజులు దులపడం, ఇల్లు కడిగించడం, ముగ్గులు పెట్టడం, బంతి పూలు, మావిడాకుల తోరణాలు, పిండి వంటలు చేయడం, పండగకన్నా పెళ్ళయిన తర్వాత మొదటిసారి వస్తోందన్న ఆనందమే ఎక్కువగా వుంది.

బాల రేపొస్తుందనగా ముందురోజు రాత్రి సీతని దగ్గరగా తీసుకుని, ముద్దుపెట్టుకుని, మెల్లిగా అడిగింది కామాక్షి.

"అక్కకి నీ బుట్ట లోలాకులు యిద్దామా!"

"నేనివ్వను. ఇవి నావి. అక్కకి నేనెందుకివ్వాలి?" అంది మొండిగా. ఇంకోసారి ముద్దుపెట్టుకుని, బుగ్గల్ని పుణికింది కామాక్షి.

"మా బంగారు కదా. చీటీ వేస్తున్నాను కదా, ఆ చీటీ నాకొచ్చినప్పుడు, ఆ చీటీ డబ్బుతో నీక్కొంటాను. కొత్తరకంది. మా బుజ్జికదూ, మా కన్నకదూ"

ఏడుస్తూనే చెవులకున్న బుట్ట లోలాకులు తీసి యిచ్చింది సీత. కామాక్షి వాటిని తోమి, తుడిచి, ఎర్ర కాయితంలో చుట్టి దాచింది.

బాల, మొగుడు వచ్చేరోజున శేషాద్రి వెళ్ళాడు. కూతుర్ని, అల్లుడిని ఆటోలో తీసుకొచ్చాడు.

సరదాగా దసరాలు గడిచిపోయాయి.

సీతకి పరికిణీగుడ్డ యిచ్చింది బాల. "దీపావళికి కుట్టించుకో.." వెళ్ళేముందు తమ్ముళ్ళిద్దరి చేతుల్లో డబ్బుంచింది.

వాళ్ళని దింపడానికి యింటిల్లిపాది స్టేషన్కెళ్ళారు. అందరూ..ఏడ్చారు. శేషాద్రి ఎవరూ చూడకుండా కళ్ళు తుడుచుకున్నాడు.

ఆ తర్వాత బాల చాలాసార్లు వచ్చింది. వచ్చినప్పుడల్లా సీతకి ఏదో ఒకటి తెచ్చేది. వెళ్ళేముందు చేతిలో డబ్బుంచేది.

"ఎందుకక్కా..ప్రతీసారి.."

"నా మొదటి పండక్కి, నీ బుట్ట లోలాకులు ఇచ్చావా, లేదా ? దానికి బదులుగా నేనెన్నిచ్చినా సరిపోదు. ఎదురు ప్రశ్నలు వేయకుండా తీసుకో. నేనెన్ని రోజులు ఈయగలిగితే, అన్ని రోజులిస్తాను..."

అలాగే అయింది. అక్కకి ముగ్గురు పిల్లలు. బాల పుట్టింటికి రావడం అరుదే అయింది. ఏదైనా కార్యం, కథ ఉంటేనే వస్తోంది. ఓ పూట ఉండి, హడావుడిగా వెళ్ళిపోతోంది.

సీతకి పెళ్ళయ్యాక, మొదటి దీపావళికి కామాక్షి "నీకు నచ్చిన చీర కొనుక్కో" అని రెండు వేలు యిచ్చింది.

"ఎందుకమ్మా" అని అనలేదు. పైగా సంతోషంగా, అదో జన్మహక్కులా తీసుకుంది. తండ్రి అనుకున్నట్లుగా దోపిడి అనుకోలేదు. పైగా ఆఫీసులో అందరికీ గొప్పగా చెప్పుకుంది. నిజంగా తల్లి అంత

డబ్బు యిచ్చే స్థితిలో ఉందో లేదో ఆలోచించలేదు. ఆ దృష్టి ఎందుకు రాలేదో చాలా రోజుల వరకూ సీతకి అర్థం కాలేదు.

ఈ రోజున సుమిత్ర. అలాంటి స్థితిలోనే ఉంది. ఓ తల్లి తన కూతురికి ఇవ్వాలనుకోడానికి బీదా, గొప్ప అడ్డురావు. బీదయినా, గొప్పయినా తల్లి మనసు తల్లి మనసే. మనస్ఫూర్తిగా యిచ్చేది కానుక అవుతుంది. ఈ యిచ్చిపుచ్చుకోడాల మీదే బంధాలు నిలబడ్తాయి.

సీత లేచి బీరువా దగ్గర నుంచుంది. తెరిచి, అందులో వున్న పరుసు తీసింది. అందులో ఐదొందలున్నాయి. అది ఆమె డబ్బు. భర్త ఆనంద్‌కి తెలీదు, కాబట్టి దాన్ని లెక్క ఆనంద్‌కి చూపించక్కర్లేదు. చెప్పాల్సిన పని లేదు.

ఆ డబ్బు ఎంతుందో భర్తకి తెలీదు. కానీ ఎలా వచ్చిందో తెలుసు.

వారం రోజుల క్రితం, ఊళ్ళోనే ఉంది కదా అని తండ్రి తద్దినానికి సీతని పిలిచారు.

"అమ్మ గొడవపెడ్తే తద్దినం పెట్టాం. కానీ ఇంత ఖర్చు చేస్తూ పెట్టాలని మాకు లేదు. వచ్చే ఏడాది సంగతి దేవుడెరుగు.." అని అన్నయ్యలిద్దరూ అంటే, "ఏవనుకోకు సీతా, జాకెట్టు కొనుక్కో" అంటూ వదినలిద్దరూ తమలపాకుల్లో యాభై, యాభై పెట్టి పంపారు.

సీతకి దుఃఖం పొంగుకొచ్చింది. ఇద్దరన్నయ్యలు కలిసీ, ఏడాదికో సారి, తద్దినానికి పిలిచి, చీర పెట్టలేరా! పెట్టగలరు. స్థోమత ఉంది. కానీ అది ఓ అనవసర ఖర్చుగా అనిపించింది వాళ్ళకి.

వాళ్ళు నాకు చీరపెట్టకపోతే నా చీరలు నేను కొనుక్కోలేనా? అని తనకి తను నచ్చచెప్పుకుంటూ తల్లి కామాక్షి ఉన్న గదిలోకి వెళ్ళింది.

జాకెట్టులోంచి చిన్న వెల్వెట్టు పర్సు తీసి, నాలుగు వంద కాయితాలు తీసి సీత చేతిలో ఉంచింది తల్లి.

"పెద్దపిల్ల ఎలాగూ దూరంగానే ఉంది. దగ్గరగా నువ్వొక్కదానివే ఉన్నావు. వాళ్ళు చీర కొన్లేదని అనుకోకు. నాకొచ్చే పెన్షన్ వాళ్ళకిచ్చినా, నా దగ్గర కొంచెం ఉంచుకుంటాను. ఇది అలా దాచుకున్న నా డబ్బే"

సీత కన్నీళ్ళని ఆపుకుంది.

"వొద్దమ్మా. నువ్వే ఉంచుకో. నీకే ఏ అవసరం అయినా వస్తే, మళ్ళా అన్నయ్యలని అడగక్కర్లేదు"

"వొద్దనకు..తీసుకో..నేనున్నన్నిరోజులే కదా ఈ ముచ్చట."

సీత గొంతు మూగబోయింది.

"మీ నాన్నగారు ఇదో దోపిడి అనేవారు. ఇది దోపిడి కాదు అని వాదించే దాన్ని. ఇది ఇంట్లోని మనుషుల మధ్య రాకపోకలకి వీసాల్లాంటివి. స్టాంపు కొట్టిన వీసాలాంటివి. అంతేకానీ దోపిడి కాదు.."

"నీ దగ్గరున్నదంతా ఇచ్చేసావు కదా, మరి నీ శ్రమని దోచుకున్నట్లే కదా"

కామాక్షి నవ్వింది.

"అలా అంటావా! సరే అయితే నాకిష్టమైన దోపిడి. నువ్వో ప్రియమైన బందిపోటువి. మళ్ళా ఓ పదిరోజుల్లో నా పెన్షనొస్తుంది లే. తీసుకో..దసరా దీపావళి రెండూ వస్తున్నాయి. ఏదైనా చీర కొనుక్కో"

అలా వచ్చిన డబ్బు అది. అందులోంచి రెండొందలు తీసుకుని ముందు గదిలోకి వచ్చింది.

"అవమ్మా..పనయిపోయింది. పోతున్న ఏమన్న పైసలిస్తవ?"

రెండొందలు సుమిత్ర చేతిలో ఉంచింది.

ఆమె కళ్ళల్లో మెరుపు. అందులో మమత మమకారం మెరుపులు. ఇలాంటిదే రేపు బతకమ్మ పండగకి వచ్చే కూతురి కళ్ళల్లో కనిపించవచ్చు. సంతోషంగా వెళ్ళిపోయింది.

"అమ్మా..." నిద్ర లేచిన రెండేళ్ళ కూతురు సీత వెనకాల నుంచుని, మోకాలి దగ్గర పట్టుకుంది.

చటుక్కున వెనక్కి తిరిగి, ముద్దుగా చెదిరిన జుట్టుతో ఉన్న కూతుర్ని ఎత్తుకుని ముద్దుపెట్టుకుంది.

"నా ప్రియమైన బందిపోటు దొంగవి. బజారెళ్ళి బట్టలు కొనుక్కుందాం. నన్ను దోపిడి చెయ్యచ్చు" ఆ కూతురికి అర్థం అయిందో లేదో పట్టించుకోలేదు.

○



## అనుష్క గుడి?

**త**మిళంలో అనుష్క ఇప్పటి దాకా 'రెండు' అనే సినిమా మాత్రం చేసింది. ఇది ఫ్లాపయింది కూడా. ఆ తర్వాత 'అరుంధతి' డబ్బింగ్ వెర్షన్‌తో అమాంతం తమిళ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టేసింది. విజయ్‌తో ఆమె చేస్తున్న తాజా చిత్రం స్టిల్స్ చూసి ఇంకా ఆ సినిమా రిలీజవకుండానే ఫ్యాన్స్ తెగ ఇదైపోతున్నారట. ఆమె ఊ అంటే చాలు, ఆమెకో గుడి కడతామని ఇటీవల ఆమెని కోరారట కొంతమంది అభిమానులు. అనుష్క మాత్రం అలాంటి పనులేవీ చేయొద్దని రిక్వెస్ట్ చేసి వాళ్లని పంపించేసిందిట.